# పదోతరగతి తెలుగు

## మాతృభావన

## ప్రతిపదార్థం

✪ అనల జ్యోతుల నీ పతివ్రతలఁ ........ దుశ్చారిత్రముల్ సాగునే?

ప్రతిపదార్థం:

అనల జ్యోతులన్ = అగ్ని జ్వాలల లాంటి

ఈ పతివ్రతలన్ = ఈ పతివ్రతలను

పాపాచారులై = అపచారం చేసేవారై

డాయు = కలిసే

భూజనులు + ఎల్లను = భూమిపై ఉన్న ప్రజలు అందరూ,

నిజ సంపదల్ = తమ సంపదలను

తొఱగి = పోగొట్టుకుని

అస్తధ్వస్తులు + ఐ = సర్వనాశనమైనవారై

పోరె = పోకుండా ఉంటారా?

విత్తనమే = సంతానం

నిల్చునె = నిలుస్తుందా?

మున్ను = పూర్వం

పులస్త్యబ్రహ్మసంతానమున్ = పులస్త్యబ్రహ్మ కుమారుడైన రావణుడిని గురించి

ఎఱుంగమె = మనకు తెలియదా?

హైందవ భూమి = భారత భూమిలో

ఈ పగిది = ఇలాంటి

దుశ్చారిత్రముల్ = చెడు పనులు

సాగునే = సాగుతాయా?



R-28-11-14

## పద్యపూరణ – భావ లేఖనం

- ✪ భావ లేఖనం విషయంలో పద్యంలో సంబోధన ఉంటే తప్పనిసరిగా ఆ సంబోధనతోనే భావాన్ని ప్రారంభించాలి.

**ఉదా:** దయాసముద్రుడా! తరిగొండ నృసింహదేవా!, భక్తుల పాలిట చింతామణియైన ఓ స్వామీ!

- ✪ పద్యంలోని ప్రతి పాదానికీ భావాన్ని చిన్నచిన్న వాక్యాల రూపంలో స్పష్టంగా రాయాలి.
- ✪ పూర్వాపరాలతో సంబంధం లేకుండా భావం సూటిగా రాస్తే సరిపోతుంది.

**1. సురుచిరతారకాకుసుమశోభి... పశ్చిమదిక్తటంబునన్.**

సురుచిరతారకాకుసుమశోభి నభోంగణభూమిc గాలమ
న్గరువవపుసూత్రధారి జతనంబున దిక్పతికోటి ముందటన్
సరసముగా నటింపcగ నిశాసతి కెత్తిన కొత్తతోcపుcబెం
దెర యన నొప్పె సాంధ్యనవదీధితి పశ్చిమదిక్తటంబునన్.

**భావం:** ప్రకాశించే చుక్కలనే పూలతో ఆకాశం అనే రంగస్థలం అలంకరింపబడింది. దానిమీద కాలమనే గొప్ప సూత్రధారి గొప్ప ప్రయత్నం చేస్తున్నాడు. ఈ ప్రయత్నంలో దిక్పాలకుల సమూహం ముందు, రాత్రి అనే స్త్రీ నాట్యం చేయడానికి వచ్చింది. అప్పుడు ఆమె ముందు పట్టుకొన్న లేత ఎరుపురంగు తెర ఏమో అనేటట్లుగా, సంధ్యాకాలపు కొత్త కాంతి, పడమటి దిక్కున ప్రకాశించింది.

**2. అనుచున్ జేవురుమీఱు కన్నుcగవతో... సోన్‌దేవునిన్.**

అనుచున్ జేవురుమీఱు కన్నుcగవతో నాస్పందదోష్ఠంబుతో
ఘన హుంకారముతో నటద్భ్రుకుటితో గర్జిల్లు నా భోన్‌సలే
శునిc జూడన్ బయిలోడెc గొల్వు; శివుడీసున్ గుత్తుకన్ మ్రింగి, బో
రన నవ్వారల బంధ మూడ్చి గొనితేరన్ బంచె సోన్‌దేవునిన్.

**భావం:** అంటూ ఉన్న శివాజీ కన్నులు ఎర్రబారాయి. పై పెదవి అదిరిపడుతోంది. గట్టిగా హుంకరించాడు. ముడితో కూడిన కనుబొమ్మలు కదలాడుతున్నాయి. గర్జిస్తున్న ఆ భోన్‌సలేశుని చూడటానికి సభ భయపడింది. అప్పుడు శివాజీ తన కోపాన్ని గొంతులోనే అణచుకున్నాడు. వెంటనే వారి సంకెళ్లను తొలగించి, తీసుకుని రమ్మని సోన్‌దేవుడిని ఆజ్ఞాపించాడు.

**3. పట్టుగ నీశ్వరుండు తన పాలిట నుండి... దయాపయోనిధీ!**

పట్టుగ నీశ్వరుండు తన పాలిట నుండిపుడిచ్చినంతలోc
దిట్టక దీనదేహులను తేటగ లాలన జేసి, యన్నమున్
పెట్టు వివేకి మానసముc బెంపొనరించుచు నూరకుండినన్
గుట్టుగ లక్ష్మిcబొందుc ; దరిగొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:** దయాసముద్రుడా! తరిగొండ నృసింహదేవా! వివేకి అయినవాడు తనకు భగవంతుడు ప్రసాదించినంతలో అనాథలను నిరుపేదలను కసురుకోక, ఆప్యాయతతో లాలిస్తూ, అన్నం పెడతాడు. తన మనసులో ఆనందపడుతుంటాడు. అలాంటి మంచివాడి వద్దకు లక్ష్మీదేవీ రహస్యంగా వచ్చి చేరుతుంది.

**4. అనయము దోషమే పరులయందు... శ్రియఃపతీ!**

అనయము దోషమే పరులయందు కనుంగొని పల్కునట్టి యా
జనుని కొగిన్ గుణగ్రహణశక్తి నశించును; మంచి మాత్రమే
జనములలోన చూడగల చక్కని చూపులు పల్కునాల్క నా
కెనయగనిమ్ము వేంకటపతీ! అఖిలాండపతీ! శ్రియఃపతీ!

**భావం:** అఖిలాండ నాయకా! లక్ష్మీవల్లభా! వేంకటపతీ! ఇతరుల్లో ఎల్లప్పుడూ తప్పులనే చూసి వాటిని గురించి మాత్రమే మాట్లాడేవాడికి, క్రమంగా మంచిని గ్రహించే శక్తి నశిస్తుంది. అందరిలోనూ మంచిని చూసే చూపులు, అందరితోనూ మంచిగా మాట్లాడే నాలుకను నాకు ప్రసాదించు.

**5. వేద పురాణ శాస్త్ర పదవీ నదవీయసియైన..... ఘల్లుఘల్లనన్.**

వేద పురాణ శాస్త్ర పదవీ నదవీయసియైన పెద్దము
త్తైదువ కాశికానగర హాటక పీఠ శిఖాధిరూఢ య
య్యాదిమ శక్తి, సంయమివరా! యిటు రమ్మని పిల్చె హస్తసం
జ్ఞాదర లీల రత్నఖచితాభరణంబులు ఘల్లుఘల్లనన్.

**భావం:** సకల వేదాలు, సకల పురాణాలు, సకల శాస్త్రాలు చెబుతున్న మార్గానికి దగ్గరగా ఉన్న పెద్ద ముత్తదువ. కాశీనగరం అనే బంగారు పీఠాన్ని అధిరోహించిన ఆదిమ శక్తి. అలాంటి ఆమె తన చేతితో సంజ్ఞ చేసింది. ఆ సంజ్ఞలో ఆదరం కనపడింది. అప్పుడామె రత్నఖచితమైన ఆభరణాలు ఘల్లు ఘల్లుమని చప్పుడయ్యాయి. అలా చప్పుడవుతుండగా, ఆమె 'ఓ మునీశ్వరా! ఇటు రమ్ము' అని వ్యాసుడిని పిలిచింది.

## సూచనలు:

- ✪ పద్య పూరణ విషయంలో ఎంపిక చేసుకున్న పద్యంలోని నాలుగు పాదాల్లో ప్రాస స్థానంలోని అక్షరం సమానంగా ఉండాలి.
- ✪ అక్షర దోషాలు లేకుండా జాగ్రత్త పడాలి.
- ✪ పద్య పాదాల్లోని సంధి పదాలను విడదీయకుండా రాయాలి.

**ఉదా:** 'బీదలకన్న వస్త్రములు పేర్మినొసంగుము' అని రాయాలి. అంతేగానీ 'బీదలకు అన్నవస్త్రములు పేర్మినొసంగుము' అని సంధి పదాలను విడదీయకూడదు.

**రచయిత: పెద్దింటి శారంగపాణి**